సాక్షి
రాజన్న సిరిసిల్ల

బుధవారం । 15 । నవంబర్ । 2023



ప్రశాంతంగా ఎన్నికలు

వేములవాడరూరల్: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని వేములవాడ రూరల్ సీఐ కృష్ణకుమార్ కోరారు.



కొనుగోలు కేంద్రాలు పరిశీలన

తంగళ్లపల్లి: నేరెళ్లలోని కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం సివిల్ సప్లయ్ కమిషనర్ అనిల్‌కుమార్, అడిషనల్ కలెక్టర్ ఖీమ్యా నాయక్‌తో కలిసి పరిశీలించారు.

గరిష్ఠం/కనిష్ఠం
32.0/21.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వేగంగా వీస్తాయి. వర్షం కురిసే అవకాశం లేదు.

న్యూస్‌రీల్

జిల్లాలో నేడు మంత్రి కేటీఆర్ పర్యటన



మంత్రి కేటీఆర్

సిరిసిల్ల: జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కె.తారక రామారావు బుధవారం పర్యటిస్తున్నారు. ఈమేరకు మంత్రి పర్యటన షెడ్యూల్‌ను వ్యక్తిగత కార్యదర్శి మహేందర్‌రెడ్డి మంగళవారం వెల్లడించారు. బుధవారం ఉదయం 11 గంటలకు జగిత్యాల జిల్లా కథలాపూర్(మేడిపల్లి)లో ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొంటారు. రుద్రంగిలో మధ్యాహ్నం రోడ్‌షోలో పాల్గొని ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటలకు చందుర్తిలో ప్రజాఆశీర్వాద సభలో పాల్గొంటారు. 2 గంటలకు కోనరావుపేటలో రోడ్‌షో, 3.30 గంటలకు వేములవాడపట్టణం, అర్బన్, రూరల్ మండలాల్లో రోడ్‌షోలలో కేటీఆర్ పాల్గొంటారు. సాయంత్రం 6 గంటలకు తంగళ్లపల్లిలో జరిగే రోడ్‌షోలో ప్రసంగిస్తారని వివరించారు.

ఇష్టపడి చదివి.. ఉన్నతంగా రాణించాలి

- సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఆర్.శ్రీలేఖ

సిరిసిల్లటౌన్: విద్యార్థినిలు ఇష్టపడి చదివి ఉన్నతంగా రాణించాలని సిరిసిల్ల సీనియర్ సివిల్ జడ్జి ఆర్.శ్రీలేఖ కోరారు. సిరిసిల్లలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడారు. బాలిక, మహిళల రక్షణ చట్టాలపై వివరించారు. న్యాయ విజ్ఞాన సమితి సభ్యుడు చింతోజు భాస్కర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్, న్యాయవాదులు కళ్యాణి, ఆడెపు వేణు పాల్గొన్నారు.

రూ.1.60 లక్షలు సీజ్



నగదు సీజ్ చేస్తున్న అధికారులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని జిల్లెల్ల చెక్‌పోస్టులో మంగళవారం రూ.1.60 లక్షల నగదును అధికారులు సీజ్ చేశారు. ఒక కారులో రూ.90 వేలు, మరో కారులో రూ.70 వేలు నగదును గుర్తించి సీజ్‌చేశారు.

ప్రతిష్టాత్మకంగా 'ఆరోగ్య మహిళ'



నేరెళ్ల పీహెచ్‌సీలో వైద్య, ఆరోగ్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'ఆరోగ్య మహిళ'ను ప్రతీవారం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు తెలిపారు. సిరిసిల్లలోని బీవైనగర్, వేములవాడ పీఏసీ, నేరెళ్ల పీహెచ్‌సీ, తంగళ్లపల్లి పీహెచ్‌సీల్లో మంగళవారం పలువురు మహిళలకు ఉచితంగా వైద్యపరీక్షలు చేశారు. సమస్యలు ఉన్న ఎనిమిది మందిని జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు తెలిపారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

రుద్రంగి(వేములవాడ): మండలకేంద్రంలోని గంగపుత్ర సంఘం భవనంలో మంగళవారం మండల వ్యవసాయాధికారులు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించారు. వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగు చేయాలని సూచించారు. ఎకరం భూమిలో ఆయిల్‌పామ్ సాగుచేస్తే ప్రభుత్వం ఏటా రూ.4200 అందజేస్తుందని తెలిపారు. రైతులు దేశవేని శ్రీనివాస్, భూమయ్య, భూమేశ్, ఎల్ల గంగాధర్, గాజ నర్సయ్య పాల్గొన్నారు.

యువతే నిర్ణేత

జంగ్ తెలంగాణ

ఉమ్మడి జిల్లాలో 93,849 మందికి తొలిసారి ఓటుహక్కు

- మొత్తం ఓట్లలో 30–39 ఏళ్లలోపు వారివే అధికం
- ప్రధాన పార్టీల చూపు వారివైపే..

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 13 అసెంబ్లీ స్థానాల్లో యువ ఓటర్లే కీలకం కానున్నారు. కొత్తగా ఓటు నమోదుకు ఎన్నికల సంఘం పలుమార్లు గడువు ఇవ్వడంతో 18 ఏళ్లు నిండిన వారు అధిక సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో గెలుపోటములను నిర్ణయించే స్థాయిలో యువ ఓటర్లు నమోదయ్యారు. దీంతో ప్రధాన పార్టీలన్నీ వారిని ప్రసన్నం చేసుకోవడానికి కార్యాచరణను రూపొందించుకుంటున్నాయి. ఇందుకోసం కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలలో ప్రత్యేక విభాగాలు పని చేస్తున్నాయి. ఎన్నికలకు ఇంకా 15 రోజుల సమయమే ఉండటంతో ఆయా పార్టీల నాయకులు క్షేత్రస్థాయిలో యువ ఓటర్లతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎలాగైనా వారిని తమవైపు తిప్పుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

ముంచుతారో.. తేల్చుతారోనని భయం

2018 ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థికి, ఓడిన అభ్యర్థికి మధ్య చాలా నియోజకవర్గాల్లో స్వల్ప తేడా మాత్రమే ఉంది. ప్రస్తుతం పెరిగిన యువ ఓటర్ల సంఖ్య దాదాపుగా దీనికి సమానంగా ఉండటంతో ఫలితాలపై వీరి ప్రభావం ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అలాగే, మొత్తం ఓటర్లలో 30 నుంచి 39 ఏళ్ల మధ్య వయసున్నవారే అధికంగా ఉన్నారు. వారు తమను ముంచుతారో.. తేల్చుతారోనని అని పార్టీలూ భయపడుతున్నాయి. బయటకు మాత్రం పెరిగిన ఓట్లు తమకే లాభం చేకూరుస్తాయని చెప్పుకుంటున్నప్పటికీ లోపల ఆందోళన చెందుతున్నట్లు సమాచారం.

మంథనిలో ఎక్కువ మంది..

ఓటరు జాబితా ప్రకారం తొలిసారిగా ఓటుహక్కు నమోదు చేసుకున్నవారు మంథనిలో(8,716), 80 ఏళ్ల పైబడినవారు కరీంనగర్‌లో (5,316) ఎక్కువ మంది ఉన్నారు. మొత్తంగా చూసినట్లయితే ఉమ్మడి జిల్లాలో 18 నుంచి 39 ఏళ్లలోపు వారి ఓట్లే అధికం. దాదాపు అన్ని నియోజకవర్గాల్లో వీరి ఓట్లు 50 శాతానికి పైనే ఉన్నాయి. వారిని మచ్చిక చేసుకుంటే గెలుపు నల్లేరుపై నడకేనని భావిస్తున్న పార్టీలు తమ వైపు తిప్పుకోవాలని చూస్తున్నాయి.



నియోజకవర్గాల వారీగా పెరిగిన ఓటర్లు..

18–19 ఏళ్లవారు: కోరుట్లలో 8,178, జగిత్యాలలో 7,744, ధర్మపురిలో 7,483, రామగుండంలో 5,990, మంథనిలో 8,716, పెద్దపల్లిలో 8,530, కరీంనగర్‌లో 8,598, చొప్పదండిలో 6,165, వేములవాడలో 6,246, సిరిసిల్లలో 6,735, మానకొండూర్‌లో 5,863, హుజూరాబాద్‌లో 9,008, హుస్నాబాద్‌లో 7,293 మంది ఉన్నారు.

20–29 ఏళ్లవారు : కోరుట్లలో 50,192, జగిత్యాలలో 48,116, ధర్మపురిలో 47,928, రామగుండంలో 44,226, మంథనిలో 51,575, పెద్దపల్లిలో 51,851, కరీంనగర్‌లో 69,457, చొప్పదండిలో 46,862, వేములవాడలో 47,132, సిరిసిల్లలో 48,857, మానకొండూర్‌లో 42,820, హుజూరాబాద్‌లో 52,478, హుస్నాబాద్‌లో 48,332 మంది ఉన్నారు.

30–39 ఏళ్లవారు : కోరుట్లలో 57,837, జగిత్యాలలో 50,807, ధర్మపురిలో 53,451, రామగుండంలో 64,456, మంథనిలో 63,667, పెద్దపల్లిలో 66,875, కరీంనగర్‌లో 90,160, చొప్పదండిలో 54,030, వేములవాడలో 55,914, సిరిసిల్లలో 62,727, మానకొండూర్‌లో 57,107, హుజూరాబాద్‌లో 64,862, హుస్నాబాద్‌లో 66,026 మంది ఉన్నారు.

40–49 ఏళ్లవారు : కోరుట్లలో 50,166, జగిత్యాలలో 45,345, ధర్మపురిలో 43,805, రామగుండంలో 44,859, మంథనిలో 44,406, పెద్దపల్లిలో 49,862, కరీంనగర్‌లో 76,432, చొప్పదండిలో 44,057, వేములవాడలో 42,463, సిరిసిల్లలో 48,046, మానకొండూర్‌లో 42,206, హుజూరాబాద్‌లో 48,866, హుస్నాబాద్‌లో 46,238 మంది ఉన్నారు.

50–59 ఏళ్లవారు : కోరుట్లలో 37,945, జగిత్యాలలో 38,322, ధర్మపురిలో 34,766, రామగుండంలో 33,977, మంథనిలో 33,608, పెద్దపల్లిలో 34,998, కరీంనగర్‌లో 54,631, చొప్పదండిలో 36,660, వేములవాడలో 33,003, సిరిసిల్లలో 36,249, మానకొండూర్‌లో 32,519, హుజూరాబాద్‌లో 34,136, హుస్నాబాద్‌లో 34,294 మంది ఉన్నారు.

60–69 ఏళ్లవారు : కోరుట్లలో 22,606, జగిత్యాలలో 23,644, ధర్మపురిలో 22,576, రామగుండంలో 19,230, మంథనిలో 20,760, పెద్దపల్లిలో 24,414, కరీంనగర్‌లో 33,230, చొప్పదండిలో 25,432, వేములవాడలో 21,982, సిరిసిల్లలో 24,130, మానకొండూర్‌లో 23,475, హుజూరాబాద్‌లో 23,359, హుస్నాబాద్‌లో 23,981 మంది ఉన్నారు.

70–79 ఏళ్లవారు : కోరుట్లలో 10,928, జగిత్యాలలో 12,672, ధర్మపురిలో 12,580, రామగుండంలో 6,901, మంథనిలో 10,691, పెద్దపల్లిలో 13,592, కరీంనగర్‌లో 17,230, చొప్పదండిలో 14,473, వేములవాడ లో 11,752, సిరిసిల్లలో 13,145, మానకొండూర్‌లో 13,148, హుజూరాబాద్‌లో 12,357, హుస్నాబాద్‌లో 14,017 మంది ఉన్నారు.

80+ ఏళ్లవారు : కోరుట్లలో 3,003, జగిత్యాలలో 4,818, ధర్మపురిలో 4,291, రామగుండంలో 1,380, మంథనిలో 3,019, పెద్దపల్లిలో 4,144, కరీంనగర్‌లో 5,316, చొప్పదండిలో 5,311, వేములవాడలో 3,759, సిరిసిల్లలో 4,537, మానకొండూర్‌లో 4,475, హుజూరాబాద్‌లో 4,492, హుస్నాబాద్‌లో 2,001 మంది ఉన్నారు.



పోలింగ్ కేంద్రంలో 1,400మంది ఓటర్లు మాత్రమే...

మీకు తెలుసా...!



కరీంనగర్‌రూరల్: ప్రతీ పోలింగ్ కేంద్రంలో గరిష్ఠంగా 1400 మంది ఓటర్లు మాత్రమే ఉంటారు. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియలో ఉపయోగిస్తున్న ఈవీఎంలకు లింక్ చేసిన వీవీ ప్యాట్‌లో థర్మల్ పేపర్ పొందుపరుస్తారు. 1,500 స్లిప్పులను మాత్రమే పేపర్ ప్రింట్ చేస్తుంది. 25.5 ఓల్టేల బ్యాటరీతో పనిచేసే వీవీప్యాట్‌లో ఓటు ఎవరికి వేసిందనేది డిస్‌ప్లేలో కన్పిస్తోంది. పోలింగ్‌రోజున ఏజెంట్ల సమక్షంలో అధికారులు ఈవీఎం పనితీరును పరిశీలించేందుకు మాక్ పోలింగ్ కోసం దాదాపు వందవరకు ఉపయోగిస్తారు. అందుకే ప్రతి పోలింగ్ కేంద్రంలో 1400 మంది ఓటర్లు ఉండేలా ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది.

ఈవీఎంల కమిషనింగ్‌పై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి



శిక్షణకు హాజరైన ఎన్నికల అధికారులు

- శిక్షణలో కలెక్టర్ అనురాగ్ జయంతి
- ప్రతి ఇంటికి ఓటరు స్లిప్‌లు
- సీ–విజిల్ పాంప్లెట్ల పంపిణీ

సిరిసిల్ల: ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం మేరకు ఈవీఎంల కమిషనింగ్‌పై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి పేర్కొన్నారు. సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల, వేములవాడ జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం సెక్టార్ అధికారులకు, ఏఈవోలకు ఈవీఎం కమిషనింగ్ ప్రక్రియపై శిక్షణ ఇచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల బరిలో ఉండే అభ్యర్థులు ఖరారు అయ్యాక ఈవీఎంల కమిషనింగ్ ఉంటుందని తెలిపారు. ఈవీఎం కమిషనింగ్‌కు ఎన్నికల్లో పోటీలో ఉండే అభ్యర్థులు కూడా వస్తారని చెప్పారు. ఎన్నికల రోజు కోసం ఈవీఎంలను సిద్ధం చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈవీఎంల కమిషనింగ్‌పై అధికారులు పూర్తి అవగాహనను పెంపొందించుకోవాలని సూచించారు. రిటర్నింగ్ అధికారులు ఎన్.ఆనంద్‌కుమార్, మధుసూదన్, సీపీవో పీబీ శ్రీనివాసాచారి, జిల్లా పంచాయతీ అధికారి రవీందర్, మున్సిపల్ కమిషనర్ అన్వేశ్ ఉన్నారు.

ప్రతి ఇంటికి ఓటరు స్లిప్స్

నవంబర్ 30న జరిగే పోలింగ్ శాతాన్ని పెంచేందుకు జిల్లాలో ప్రతి ఇంటికి ఓటరు స్లిప్స్ పంపిణీ చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. ఈమేరకు ఈనెల 13 నుంచి ఓటరు సమాచార స్లిప్స్‌ను బూత్ లెవెల్ అధికారుల ద్వారా పంపిణీ చేస్తున్నారు. ఓటరు స్లిప్పులతో పాటు సీ–విజిల్ పాంప్లెట్‌ను ఓటర్లు అందించాలన్నారు.

సోషల్ మీడియాపై దృష్టి పెట్టండి

- ఎస్పీ అఖిల్ మహాజన్
- ఇల్లంతకుంట పీఎస్ ఆకస్మిక తనిఖీ

సాక్షి ఎఫెక్ట్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఎన్నికల సమయంలో సోషల్‌మీడియా పోస్టులపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు ఎస్పీ అఖిల్‌మహాజన్ సూచించారు. 'సాక్షి'లో మంగళవారం ప్రచురితమైన 'ఇల్లంతకుంటలో సోషల్‌మీడియా వార్' కథనానికి స్పందించి ఇల్లంతకుంట పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ పోలింగ్ తేదీ దగ్గర పడుతున్నందునా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్‌మీడియా వేదికగా వివిధ వర్గాల మధ్య, వ్యక్తుల మధ్య అల్లర్లు సృష్టించే వారిపై, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా పోస్టులు పెట్టే వారిపై దృష్టి పెట్టాలన్నారు. గ్రూప్ అడ్మిన్లపై కేసులు నమోదు చేయాలని సూచించారు. అనంతరం ఠాణా పరిధిలోని ఇల్లంతకుంట, కందికట్కూర్, గాలిపెల్లి, అనంతారం, పెద్దలింగాపూర్ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను సందర్శించి పలు సూచనలు చేశారు. సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, ఇల్లంతకుంట ఎస్సై దాస సుధాకర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటాం



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్



బొట్టుపెట్టి ఓటు అభ్యర్థిస్తున్న ఆది శ్రీనివాస్ సతీమణి ఆది వనజ

- ఆరు పథకాలు అమలు చేస్తాం
- వేములవాడ కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్

వేములవాడరూరల్/చందుర్తి: కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటామని ప్రభుత్వం ఏర్పడగానే ఆరు పథకాలు అమలు చేస్తామని కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడరూరల్ మండలం బాలరాజుపల్లి, వెంకటాంపల్లి, ఎదురుగట్ల, అచ్చన్నపల్లి గ్రామాల్లో మంగళవారం రాత్రి ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. గత ముప్పై ఏళ్లుగా మీ మధ్యనే ఉన్న మీ ఇంటి బిడ్డగా వస్తున్నా ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ ఆరు గ్యారంటీ పథకాలను తెలంగాణ ప్రజలకు హామీ ఇచ్చిందని.. అధికారంలోకి రాగానే వాటిని అమలు చేస్తామన్నారు. మాజీ ఎంపీపీ రంగు వెంకటేశం గౌడ్, వకుళాభరణం శ్రీనివాస్, చంద్రగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ఆది'కి మద్దతుగా సీపీఐ నాయకుల ప్రచారం

ఆది శ్రీనివాస్‌కు మద్దతుగా చందుర్తి మండలం బండపల్లిలోని ఒడ్డెరకాలనీలో సీపీఐ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి కడారి రాములు, పట్టణ కార్యదర్శి దేవరాజ్ ఆధ్వర్యంలో సీపీఐ నాయకులు మంగళవారం ప్రచారం చేశారు. ఆది శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. కోరె క్రాంతి, పెంట మల్లయ్య, పండుగ చంద్రయ్య పాల్గొన్నారు.

వేములవాడలో ఆది వనజ ప్రచారం

వేములవాడలో కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ సతీమణి ఆది వనజ మంగళవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. మహిళలకు బొట్టుపెట్టి ఓటును అభ్యర్థించారు. నాలుగుసార్లు ఓడినప్పటికీ స్థానికంగానే ఉంటూ సేవలందించారని.. ఈసారి గెలిపించాలని కోరారు.

ఫిర్యాదులపై వేగంగా స్పందించాలి

- ఎన్నికల పరిశీలకులు

సిరిసిల్ల: ఎన్నికల ఫిర్యాదులు, కోడ్ ఉల్లంఘనలపై వేగంగా స్పందించాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ జగదీశ్ సోన్‌కర్ కోరారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు మణిగండసామి, ఎన్నికల పోలీస్ పరిశీలకులు వినీతసాహు కలెక్టరేట్‌లో ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. కంట్రోల్‌రూం, సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే ఫిర్యాదులను జిల్లా కంట్రోల్‌రూమ్ ద్వారా క్షేత్రస్థాయి సిబ్బందికి ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ పరిష్కరిస్తున్నామని కలెక్టర్ వివరించారు. చెక్‌పోస్టుల వద్ద గల సీసీ కెమెరాలను, ఎన్నికల వాహనాల కదలికలను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చే ప్రకటనలు పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల పరిశీలకులు మాట్లాడుతూ అభ్యర్థులు చేసే ప్రచార ఖర్చులు పక్కాగా నమోదు చేయాలన్నారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, జిల్లా వ్యయ పర్యవేక్షణ కమిటీ నోడల్ అధికారి రామకృష్ణ, ప్రత్యేకాధికారి స్వప్న, డీపీఆర్వో దశరథం, జిల్లా లేబర్ అధికారి రఫీ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వినోద్, చేనేతజౌళిశాఖ జిల్లా అధికారి సాగర్, లైజన్ అధికారి నర్సింహులు ఉన్నారు.

ర్యాండమైజేషన్ పరిశీలన

రెండో విడత ర్యాండమైజేషన్‌ను ఎన్నికల పరిశీలకులు పరిశీలించారు. జిల్లాలో 728 మంది ప్రిసైడింగ్ అధికారులు, 739 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 1,770 మంది ఓపీవోలను రెండు నియోజకవర్గాలకు కేటాయించారు. చివరి విడతగా మూడోసారి జరిగే ర్యాండమైజేషన్‌ను పోలింగ్ సిబ్బందిని పోలింగ్‌బూత్‌ల వారీగా కేటాయిస్తారు.

బీఆర్ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి



వట్టెంలలో ప్రచారంలో పాల్గొన్న చల్మెడ లక్ష్మీనరసింహారావు

- అన్ని వర్గాలకు సమాన న్యాయం
- వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు

వేములవాడ/వేములవాడరూరల్: బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు పేర్కొన్నారు. వేములవాడరూరల్ మండలం వట్టెంల, ఫాజుల్‌నగర్, తుర్కాషినగర్, నమిలిగుండుపల్లి గ్రామాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణతో కలిసి మంగళవారం ప్రచారం చేశారు. చల్మెడ మాట్లాడుతూ గెలిచిన వెంటనే ఫాజుల్‌నగర్, తుర్కాషినగర్‌ల అభివృద్ధి, ప్రధాన రోడ్ల నిర్మాణానికి మొదటి ప్రాధాన్యత ఇస్తానన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ స్వగ్రామం నమిలిగుండుపల్లిలో మాట్లాడుతూ.. కారు గుర్తుకు ఓటు వేయాలని మీ ఊరి ఆడబిడ్డగా విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన మాజీ సర్పంచ్ రఫెక్ కుటుంబాన్ని పరామర్శించారు. ఏనుగు మనోహర్‌రెడ్డి, ఏశ తిరుపతి, ఆకుల దేవరాజం, తిరుపతిరెడ్డి, బాల్‌రెడ్డి, హన్మాండ్లు ఉన్నారు.

వాకర్స్‌తో చల్మెడ

నిత్యం హుషారుగా.. ఉల్లాసంగా ఉండాలంటే తప్పకుండా పురవాసులకు స్టేడియం, వాకింగ్‌ట్రాక్ ఉండాలని లక్ష్మీనర్సింహారావు అన్నారు. మంగళవారం ఉదయం వాకర్స్‌తో కలిసి ముచ్చటించారు. ఎంపీపీ బండ మల్లేశం, కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, నాయకులు రాజు, గోపు బాలరాజు, గోస్కుల రవి ఉన్నారు.



మామిడిపల్లిలో ప్రచారం చేస్తున్న చల్మెడ కూతురు నిహారిక, బీఆర్ఎస్ నాయకులు

తండ్రి కోసం తనయ

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని వెంకట్రావుపేటలో నేరెళ్ల జ్యోతి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేశారు. పల్లిమక్త, మామిడిపల్లి గ్రామాల్లో చల్మెడ లక్ష్మీనర్సింహారావు కూతురు నిహారిక ఇంటింటా తిరిగి తన తండ్రిని గెలిపించాలని కోరారు. సర్పంచ్ సంతోష్, మహిళా నాయకులు సంధ్య, వినోద, మంజుల పాల్గొన్నారు.

ఆకాశదీపం పూజలు

వేములవాడ: రాజన్న సన్నిధిలో మంగళవారం నుంచి కార్తీకమాసం వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆలయంలోని జేగంట వద్ద స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో ఆకాశదీపం వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. కార్తీకమాసం మొత్తం ఈ దీపం వెలుగుతూనే ఉంటుందని ఆలయ పర్యవేక్షకులు అల్లి శంకర్ తెలిపారు.



జ్ఞాపకం

కెమెరామెన్ కేటీఆర్‌తో బాలకృష్ణ

- 14 ఏళ్ల కిందటి ముచ్చట



సిరిసిల్ల సభలో బాలకృష్ణ ఫొటో తీస్తున్న కేటీఆర్

సిరిసిల్ల: మెడలో ఎర్రని, పచ్చని, గులాబీ కండువాలతో మైకు ముందు సినీనటుడు బాలకృష్ణ ప్రసంగిస్తుండగా.. రాష్ట్ర మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ఫొటో తీయడం చూడముచ్చటగా ఉంది కదా.. ఇది 14 ఏళ్ల కిందటి ఫొటో. 2009 ఎన్నికల్లో సిరిసిల్లలో కేటీఆర్ మొదటిసారి మహాకూటమి అభ్యర్థిగా పోటీచేయగా.. సినీనటుడు బాలకృష్ణ సిరిసిల్లలో ప్రచారం చేశారు. ఆ సందర్భంగా సిరిసిల్ల కళాశాల మైదానంలో కేటీఆర్ కెమెరాతో బాలకృష్ణ ప్రసంగిస్తుంగా ఫొటో తీశారు. ఆ ఎన్నికల్లో కేటీఆర్ 171 ఓట్ల స్వల్ప మెజార్టీతో అప్పటి టీఆర్ఎస్ రెబల్, ఇండిపెండెంట్ అభ్యర్థి కె.కె.మహేందర్‌రెడ్డిపై విజయం సాధించారు. ఇప్పుడు కేటీఆర్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో హెలీకాప్టర్‌లో రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేస్తుండగా.. బాలకృష్ణ మాత్రం ఆంధ్ర రాజకీయాలకే పరిమితమయ్యారు. ఆనాడు తన గెలుపు కోసం సిరిసిల్లకు బాలకృష్ణను రప్పించుకున్న కేటీఆర్ ఇప్పుడు స్టార్ క్యాంపెయినర్‌గా బీఆర్ఎస్ అభ్యర్థుల విజయం కోసం రాష్ట్రం మొత్తం పర్యటిస్తున్నారు.

రాజన్న సేవలో నవీన్‌మిట్టల్



వేములవాడ: రాజన్నను దర్శించుకునేందుకు మంగళవారం రాత్రి వేములవాడకు చేరుకున్న రెవెన్యూ చీఫ్ సెక్రెటరీ నవీన్‌మిట్టల్‌కు ఆర్డీవో మధుసూదన్, ఆలయ ఈవో కృష్ణప్రసాద్ స్వాగతం పలికారు. తహసీల్దార్ మహేశ్ ఉన్నారు.

క్లుప్తంగా

నేడు తేలనున్న అభ్యర్థుల లెక్క

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏడు నామినేషన్లు ఉపసంహరణ

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: నామినేషన్ల పరిశీల నంతరం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 261 మంది అభ్యర్థులు ఆమోదం పొందగా, మంగళవారం ఏడుగురు తమ నామినేషన్లు విత్‌డ్రా చేసుకున్నారు. దీంతో ప్రస్తుతం 254మంది పోటీదారులుగా ఉన్నారు. వీరిలో ఎవరెవరు పోటీ నుంచి తప్పుకుంటారో బుధవారం సాయంత్రానికి తేలిపోనున్నది. మంగళవారం మానకొండూర్ అసెంబ్లీలో ఒకరు, చొప్పదండిలో 2, మంథనిలో 2, కోరుట్లలో 1, వేములవాడలో 1 చొప్పున మొత్తం ఏడుగురు తమ నామినేషన్లు ఉపసహరించుకున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎన్నికల బరిలో 15మంది అభ్యర్థుల కన్నా మించితే రెండు ఈవీఎంలు ఉపయోగించాల్సి వస్తుందని, పోటీలో నిలిచిన ఇండిపెండెంట్ అభ్యర్థులతో మంతనాలు కొనసాగిస్తున్నారు. వారిని పోటీ నుంచి తప్పుకునేందుకు తమ వంతు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. దీంతో నేడు ఉపసంహరణ గడువు ముగిసేలోపు మరికొంతమంది తమ నామినేషన్లు ఉపసంహరించుకునే అవకాశం ఉంది.

ఇప్పటి వరకు బరిలో ఉన్నవారు

కరీంనగర్ నియోజకవర్గం పరిధిలో 31 మంది, చొప్పదండిలో 15, మానకొండూర్‌లో 12, పెద్దపల్లి 25, మంథని 22, రామగుండం 26, జగిత్యాల 19, కోరుట్లలో 19, ధర్మపురి నుంచి 18, హుజూరాబాద్ 25, సిరిసిల్లలో 23, వేములవాడ నుంచి 19 మంది మొత్తంగా ఇంకా 254 మంది బరిలో ఉన్నారు.

జాతీయ అవార్డులకు ఎంపిక


అనిల్


రమేశ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన శ్యామంతుల అనిల్, దుంపెన రమేశ్ జాతీయ అవార్డులకు ఎంపికయ్యారు. తెలుగు–వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ, విశ్వకర్మ గాయత్రి నాట్య కళావేదిక ఆధ్వర్యంలో డిసెంబర్ 10న విజయవాడలో నిర్వహించే కార్యక్రమంలో అవార్డులు అందజేయనుంది. శ్యామంతుల అనిల్ గత ఇరువై ఏళ్లుగా కార్వింగ్, పేయింటింగ్‌లలో చూపుతున్న ప్రతిభకు జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. దుంపెన రమేశ్ గత పన్నెండేళ్లుగా పర్యావరణ పరిరక్షణకు చేస్తున్న కృషికి ఈ అవార్డుకు ఎంపికయ్యారు.

16, 17వ తేదీల్లో జిల్లాస్థాయి ఎంపిక పోటీలు

సిరిసిల్లటౌన్: జిల్లాస్థాయిలో అండర్–14, అండర్–17 బాలురు, బాలికల చెస్, క్యారమ్స్, ఎలిజిబిలిటీ సెలక్షన్స్ ఈనెల 16, 17 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి దేవత ప్రభాకర్ తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఎలిజిబిలిటీ ఫామ్, స్టడీ సర్టిఫికెట్, ఒరిజినల్ ఆధార్ కార్డుతో పాటు గతేడాది ప్రోగ్రెస్ జిరాక్సు కాపీతో సిరిసిల్లలోని మినీస్టేడియంలో హాజరు కావాలని కోరారు. ఉదయం 9గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

సిరిసిల్లదే 'జెండా'

- దేశవ్యాప్తంగా ఇక్కడి నుంచే సరఫరా
- ప్రస్తుతం ఐదు రాష్ట్రాలకు జెండాలు, కండువాలు, టోపీలు..
- ఎన్నికలతో ఉపాధి పొందుతున్న కార్మికక్షేత్రం
- నేతన్నలకు చేతినిండా పని
- మహిళలకు పుష్కలంగా ఉపాధి

సిరిసిల్ల: దేశవ్యాప్తంగా ఎన్నికలు జరుగుతుంటే.. సిరిసిల్లలో నేతన్నలు, కండువాలు కుట్టే మహిళలు బిజీగా మారారు. ఇది ఎలా అనుకుంటున్నారా.. అవును నిజమే.. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా.. పార్టీల జెండాలు, టోపీలు, కండువాలు సిరిసిల్లలోనే తయారవుతున్నాయి. ఇక్కడ తయారైన జెండాలు, బ్యానర్లు, కండువాలే దేశవ్యాప్తంగా సరఫరా అవుతున్నాయి. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలకు చెందిన వివిధ పార్టీల జెండాల ఆర్డర్లు సిరిసిల్లకు వస్తున్నాయి. ఆయా పార్టీలకు అవసరమైన ప్రచార సామగ్రి ఇక్కడే తయారవుతుంది.


సిరిసిల్లలో సిద్ధమవుతున్న వివిధ పార్టీల జెండాలు, కండువాలు

ఎన్నికలు ఏవైనా..

ఎన్నికలు ఏవైనా ప్రచారాస్త్రాలు మాత్రం సిరిసిల్లవే. పార్టీలేవైనా.. అభ్యర్థి ఎవరైనా ఎన్నికల ప్రచారానికి వినియోగించే సామగ్రి ఇక్కడి నుంచే సరఫరా అవుతున్నాయి. వస్త్రపరిశ్రమకు నిలయమైన సిరిసిల్లలో 34వేల మరమగ్గాలు ఉన్నాయి. ఇందులో 27వేల మగ్గాలపై పాలిస్టర్ వస్త్రోత్పత్తి సాగుతుండగా.. మరో ఏడు వేల మగ్గాలపై కాటన్‌వస్త్రం ఉత్పత్తి అవుతుంది. పాలిస్టర్ బట్టపై వివిధ పార్టీల గుర్తులు, రంగులు, అభ్యర్థుల పేర్లు ప్రింటింగ్ చేసి సరఫరా చేస్తున్నారు.

నాలుగు దశాబ్దాలుగా..

- సిరిసిల్లలో మొదటిసారి 1978లో రామ్‌బలరామ్ స్క్రీన్ ప్రింటర్స్ రంగురంగుల పార్టీల జెండాలను ముద్రించడం ఆరంభించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు జెండాలు ఇక్కడి నుంచే సరఫరా అవుతున్నాయి.
- కాంగ్రెస్, తెలుగుదేశం, భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతాపార్టీ, వైఎస్సార్‌సీపీ, బహుజన సమాజ్‌పార్టీ, జనసేన, ఇలా ఆయా పార్టీల రంగుల్లో జెండాలను ప్రింట్‌చేసి అందిస్తున్నారు.
- బ్యానర్లపై పార్టీ గుర్తులు ముద్రించడం, అభ్యర్థుల పేర్లు, నినాదాలు సైతం రంగుబట్టలపై అద్దడం విశేషం.

చేతినిండా పని



సిరిసిల్లలో పాతికవేల కుటుంబాలు వస్త్రోత్పత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయి. బతుకమ్మ చీరల ఉత్పత్తి ఆర్డర్లు, ఎన్నికల ప్రచార సామగ్రి ఆర్డర్లతో నేతన్నలకు చేతినిండా పని లభిస్తుంది.

- 250 మంది నేతకార్మికులు, జెండాలను కుట్టే పనిలో మరో వెయ్యి మంది మహిళలు, మగవారు ఉపాధి పొందుతున్నారు.
- కండువా నాణ్యతను బట్టి రూ.3 నుంచి రూ.60 వరకు ఉంటుంది.
- జెండాలకు రూ.4 నుంచి రూ.180, టోపీ (క్యాప్)లకు రూ.5 నుంచి రూ.40 వరకు, తోరణాల జెండాలు 10వేల జెండాలకు రూ.8,000 నుంచి రూ.15,000 వరకు అమ్ముతున్నారు. బహిరంగ సభలకు వినియోగించే బ్యానర్లు ముద్రణ ఫ్లెక్సీ ప్రభావంతో నిలిచిపోయింది.

రోజుకు రూ.300 కూలి



బీడీలు చేస్తే రోజుకు వంద రూపాయలు రావు. బీడీల పని చాలా కష్టం. ఇదే జెండాలు, కండువాలు కట్ చేసే పనితో రోజుకు రూ.300 కూలి వస్తది. నీడ పట్టున ఉంటూ పనిచేస్తున్నాం. ఎన్నికలప్పుడు మంచిగా పని దొరుకుతుంది.
– చిక్క వసంత, కార్మికురాలు, మండెపల్లి

జెండాల కార్ఖానాలో పనిచేస్తున్న



జెండాలు తయారుచేసే కార్ఖానాలో పనిచేస్తున్న. రోజుకు రూ.300 కూలి వస్తుంది. మా ఆయన శ్రీనివాస్ ఆటో నడిపిస్తాడు. గతంలో బీడీలు చేస్తే రోజుకు రూ.150 కూడా రాకపోయేవి. ఇప్పుడు పని బాగుంది. పొద్దున 9 నుంచి సాయంత్రం 5 గంటల దాకా కార్ఖానాలో పనిచేస్తున్న.
– శ్యాగాల లావణ్య, సిరిసిల్ల

దేశవ్యాప్తంగా ఆర్డర్లు



ఐదు రాష్ట్రాల నుంచి ఆర్డర్లు వచ్చాయి. మధ్యప్రదేశ్‌లో ముందే ఎన్నికలు జరుగుతుండడంతో ఆ రాష్ట్రానికి పూర్తి స్థాయిలో సామగ్రి పంపలేకపోయాను. పశ్చిమబెంగాల్‌లో జరిగే పార్లమెంట్ ఎన్నికల ఆర్డర్లు కూడా ముందుగానే వచ్చాయి. సమయం ఎక్కువ లేక ఇబ్బంది అవుతుంది. మా వద్ద వందలాది మంది ఉపాధి పొందుతున్నారు.
– ధ్యావనపల్లి మురళి, వస్త్రవ్యాపారి, సిరిసిల్ల

సీఎమ్మార్ వెంటనే అందించాలి

- ధాన్యం కొనుగోళ్లు వేగంగా చేపట్టాలి
- పౌరసరఫరాల కమిషనర్ అనిల్‌కుమార్


అధికారులతో సమీక్షిస్తున్న అనిల్‌కుమార్

సిరిసిల్ల: జిల్లాలో రైస్‌మిల్లర్లు కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎమ్మార్)ను వెంటనే అందించాలని రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ అనిల్‌కుమార్ ఆదేశించారు. జిల్లాలో ఆయన మంగళవారం పర్యటించారు. కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశమై మాట్లాడారు. మిల్లర్లు బియ్యం అందిస్తే.. ఈ వానాకాలం 2023–24 ధాన్యం దిగుమతికి స్థలం అందుబాటులో ఉంటుందన్నారు. జిల్లాలోని ధాన్యం మన జిల్లాకే కేటాయించనున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు కావాల్సిన గోనె సంచులు అందుబాటులో ఉంచాలని, తూకం చేసిన ధాన్యాన్ని త్వరగా మిల్లులకు తరలించాలని సూచించారు. మిల్లుల్లో త్వరగా దించుకునేలా చూడాలని ఆదేశించారు. కేంద్రాల్లో రైతులకు తాగునీరు, చలవ పందిళ్లు, కూర్చునేందుకు కుర్చీలు, బెంచీలు అందుబాటులో ఉంచాలని సూచించారు. అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్, డీఎస్‌వో ఎస్.జితేందర్‌రెడ్డి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ జితేంద్రప్రసాద్, డీఆర్‌డీవో నక్క శ్రీనివాస్, రైస్‌మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చేపూరి నాగరాజు, పబ్బ నాగరాజు, రైస్‌మిల్లర్లు, డిప్యూటీ తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో గృహిణి మృతి

సిరిసిల్లటౌన్: కరెంట్ షాక్‌తో ఓ గృహిణి మృతిచెందిన సంఘటన స్థానికంగా విషాదం నింపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌కు చెందిన ఉడుత లావణ్య(40) మంగళవారం ఉదయం బట్టలు ఉతికి ఇంటి ముందర వైరుపై ఆరవేస్తుండగా కరెంట్ వైర్లకు ఉన్న జేవైరు తగిలి షాక్‌తో మృతిచెందింది. మృతురాలి మేనమామ అన్నల్‌దాస్ నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు.

ఎన్నికల ప్రశాంతతకు సహకరించాలి

- సీఐ శశిధర్‌రెడ్డి


మాట్లాడుతున్న సీఐ శశిధర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి అన్ని పార్టీల నాయకులు సహకరించాలని సీఐ శశిధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో పార్టీల నాయకులతో ఎన్నికల ప్రవర్తన, నియమావళి గురించి అవగాహన కల్పించారు. అన్ని పార్టీల నాయకులు నియమావళి ప్రకారం ప్రచారం చేసుకోవాలని పేర్కొన్నారు. ఏ పార్టీ వారైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఎన్నికల నియమావళికి లోబడి ముందుకు పోవాలని వివరించారు. గ్రామాల్లో డబ్బులు, మద్యం పంచితే సమాచారం అందించాలన్నారు. ఎన్నికలు ముగిసే వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూడాలని సూచించారు. సమావేశంలో ఎస్సై రమాకాంత్ వివిధ పార్టీల మండల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

అవినీతి నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం

- 'సెస్' చైర్మన్ చిక్కాల రామారావు


మాట్లాడుతున్న రామారావు

సిరిసిల్ల: సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్) సంస్థ 53 ఏళ్ల ప్రతిష్టకు భంగం కలిగేలా కొన్ని పార్టీల నాయకులు తమ పాలకవర్గంపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారని, తమ సంస్థలో అవినీతి జరిగినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని 'సెస్' చైర్మన్ చిక్కాల రామారావు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఆఫీస్‌లో వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతి, 'సెస్' ఎండీ సూర్యచందర్‌రావుతో కలిసి మంగళవారం విలేకరులతో మాట్లాడారు. దీపావళి పండగపూట పటాకలు కాల్చిన ఘటనతో అగ్నిప్రమాదం జరిగిందని, ఇందులో కంప్యూటర్లు, ఫర్నిచర్ దగ్ధమయ్యాయన్నారు. ఈ సంఘటన జరగడం దురదృష్టకరమని పేర్కొన్నారు. అగ్నిప్రమాదం ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, విచారణ కొనసాగుతుందన్నారు. సెస్‌లోని సీసీ కెమెరాల డిస్క్‌లను పోలీసులు స్వాధీనం చేసుకుని విచారణ చేస్తున్నారన్నారు. సంఘటనకు ఎవరైనా బాధ్యులని తేలితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. విలువైన రికార్డులు భద్రంగా ఉన్నాయని, ఆడిట్ రికార్డులు మరో గదిలో ఉన్నట్లు వివరించారు. రాజకీయ ప్రత్యర్థులు రూ.40కోట్ల అవినీతి జరిగిందని, భూకబ్జాలు చేసినట్లు ఆరోపిస్తున్నారన్నారు. ఒక్క గుంట భూమి కబ్జా చేసినట్లు నిరూపించినా రాజీనామాకు సిద్ధమని చిక్కాల రామారావు సవాల్ విసిరారు. రాజకీయ లబ్ధికోసం సెస్‌పైన, మంత్రి కేటీఆర్‌పై ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా సంస్థను బద్‌నాం చేసే ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. అగ్నిప్రమాదం ఘటనపై నివేదిక రాగానే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పట్టుదలతో రెండు ఉద్యోగాలకు ఎంపిక


వేణు

వేములవాడరూరల్: ప్రభుత్వ ఉద్యోగానికి ఎందరో యువకులు ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ ఆ యువకుడు పట్టుదలతో రెండు ఉద్యోగాలను ఏక కాలంలోనే సాధించాడు. వేములవాడ రూరల్ మండలం జయవరం గ్రామానికి చెందిన మిడిదొడ్డి వేణు 20 రోజుల క్రితమే అగ్నివీర (ఇండియన్ ఆర్మీ) ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఎంపికైన అతడు అందులో శిక్షణ పొందుతుండగానే మళ్లీ 10 రోజుల క్రితం ఇండియన్ నేవీ ఉద్యోగానికి కూడా ఎంపికైనట్లు ఉత్తర్వులు వచ్చాయి. రెండు ఉద్యోగాలకు అర్హత సాధించిన వేణు అగ్నివీర ఇండియన్ ఆర్మీకి రాజీనామా చేసి ఇండియన్ నేవీ ఉద్యోగంలో చేరాడు. ఈసందర్భంగా వేణును గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొంది రెండు ఉద్యోగాలు సాధించేందుకు కృషి చేసిన కానిస్టేబుల్ రాజశేఖర్‌కు వేణు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


సాగర్ (ఫైల్)

వీర్నపల్లి(సిరిసిల్ల): మండలంలోని వనపల్లి గ్రామానికి చెందిన కాదాస్ సాగర్ (20) సోమవారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. సాగర్ హైదరాబాద్‌లోని ఓ షాపింగ్‌మాల్‌లో పని చేస్తూ అక్కడే ఉంటున్నాడు. పని ముగించుకొని బైక్‌పై ఇంటికి వెళ్తే క్రమంలో గుర్తు తెలియని వాహనం వెనక నుంచి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సాగర్ మృతితో వనపల్లిలో విషాదం నెలకొంది.

'సెస్‌లో అగ్నిప్రమాదం ఓ కుట్ర'


మాట్లాడుతున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సెస్ కార్యాలయంలో దీపావళి రోజు జరిగిన అగ్నిప్రమాదం వెనుక కుట్ర దాగి ఉందని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే గౌస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య ఆరోపించారు. ఎల్లారెడ్డిపేటలో కాంగ్రెస్ పార్టీ ఆఫీస్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కొనుగోలు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలకు సంబంధించిన ఫైళ్లు ఉన్న గదిలో అగ్నిప్రమాదం ఉద్దేశపూర్వకంగా చేసేందేనన్నారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు. సెస్ పాలకమండలిని రద్దు చేసి ట్రాన్స్‌కోలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎల్లారెడ్డిపేట మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాలరాజుయాదవ్, కిసాన్‌సెల్ జిల్లా నాయకులు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాహెబ్, మైనార్టీ సెల్ మండలాధ్యక్షుడు రఫీక్ పాల్గొన్నారు.

వైభవంగా నమఃశివాయ మంత్ర జపయజ్ఞం


భజన చేస్తున్న భక్తసంఘం సభ్యులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల):మండల కేంద్రానికి చెందిన సత్సంగ సదనం ఆధ్వర్యంలో మంగళవారం వేములవాడలో శివనామ సంకీర్తన భవనంలో నమఃశివాయ మంత్ర జపయజ్ఞం నిర్వహించారు. ఉదయం రాజన్నను దర్శించుకున్న అనంతరం స్థానిక మార్కండేయనగర్‌లోని సత్సంగ సదనంలో మంత్ర జపయజ్ఞం నిర్వహించారు. సత్సంగ సదనం అధ్యక్షుడు బ్రహ్మచారి లక్ష్మారెడ్డి, శివనామ సంకీర్తన నిలయం నిర్వాహకులు భూపతి, భక్తులు రామారావు, సంజీవరెడ్డి, రామ్‌రెడ్డి, అనంతరెడ్డి, లక్ష్మమ్మతోపాటు మరో 150 మంది భక్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షురాలు రాజీనామా

సిరిసిల్లటౌన్: సుదీర్ఘకాలంగా అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలిగా పనిచేస్తున్న కల్లూరి చందన మంగళవారం తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఆమె ప్రస్తుతం అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్(ఏఐటీయూసీ అనుబంధం)కు జిల్లా అధ్యక్షురాలిగా, జేఏసీ అధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు. అంగన్‌వాడీల ఉద్యోగాలు రెగ్యులరైజ్ చేయాలని, సమస్యలు పరిష్కరించాలంటూ పలు దఫాలుగా పోరాటాలు చేపట్టారు. మారుతున్న కాలానుగుణంగా అంగన్‌వాడీల సమస్యలు తీరాలంటే రాజకీయంగా ఎదగాలన్న ఆకాంక్షతోనే ఆమె రాజీనామా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు ఓ జాతీయ పార్టీలో రెండు రోజుల్లోపు చేరుతారన్న ప్రచారం జరుగుతుంది. రాజకీయ అరంగేట్రం చేస్తున్నది వాస్తవమేనని, ఏపార్టీలో చేరే విషయంలో నిర్ణయానికి రాలేదని ఆమె వివరించారు. ఎన్నికల వేళ పార్టీల ఫిరాయింపులు జరుగుతున్న తరుణంలో సంక్షేమ వారధి ఉద్యోగాన్ని చేస్తున్న చందన రాజకీయ పార్టీలో చేరే విషయం చర్చనీయాంశమైంది.

అదుపుతప్పి కారు బోల్తా

చందుర్తి(వేములవాడ): మండలంలోని మర్రిగడ్డ శివారులో మంగళవారం రాత్రి కారు అదుపుతప్పి బోల్తాపడింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మర్రిగడ్డ నుంచి వేములవాడ వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాద సమయంలో కారులో డ్రైవర్‌తో పాటు ఓ యువతి ఉన్నట్లు సమాచారం. డ్రైవర్‌తో పాటు యువతి స్వల్ప గాయాలతో ఘటన స్థలం నుంచి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న ఎస్సై అశోక్ తన సిబ్బందితో హుటాహుటినా ప్రమాద స్థలానికి చేరుకున్నారు. ఘటన స్థలంలో ఎవరూ లేకపోవడంతో కారు రిజిస్ట్రేషన్ నంబర్‌కు లింకైనా ఫోన్ నంబర్‌కు ఎస్సై కాల్ చేయగా స్విచాఫ్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. కాగా కారు నంబర్ రిజిస్ట్రేషన్ అడ్రస్ మాత్రం వేములవాడ రూరల్ మండలం రుద్రవరం గ్రామానికి చెందినదిగా గుర్తించారు. అయితే ప్రమాద సమయంలో కారులో ఉన్నవారు ఎవరనే కోణంలో పోలీసుల విచారణ కొనసాగుతుంది.

ఖరీదైన వైద్యం చేయించుకోలేక నిరుపేద మృతి


లక్ష్మణ్(ఫైల్)

చందుర్తి(వేములవాడ): ఖరీదైన వైద్యం చేయించుకోలేక ఓ నిరుపేద వ్యక్తి మృతిచెందిన ఘటన చందుర్తి మండలం కట్టలింగంపేటలో మంగళవారం విషాదం నింపింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. కట్టలింగంపేటకు చెందిన మల్లారపు లక్ష్మణ్(55) నెల రోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. లక్ష్మణ్‌ను వైద్యులు పరీక్షించి రెండు కిడ్నీలు పాడయ్యాయని, డయాలసిస్ చేయించుకోవాలని సూచించారు. నాలుగైదుసార్లు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీలో డయాలసిస్ చేయించుకున్నాడు. కూలీ పని చేసుకుని జీవించే ఈ కుటుంబానికి రవాణా ఖర్చులే భారంగా మారాయి. మంగళవారం డయాలసిస్ చేయించుకునేందుకు కరీంనగర్ వెళ్లాడు. చికిత్స అందుతున్న క్రమంలోనే లక్ష్మణ్ మృతిచెందాడని గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య మల్లవ్వ, కూతురు మౌనిక, ఇద్దరు కుమారులు ఉన్నారు. నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

అభిషేకాలు, అన్నపూజలు రద్దు

వేములవాడ: కార్తీకమాసం సందర్భంగా తరలివచ్చే భక్తులకు వేములవాడ రాజన్న దర్శనం కల్పించేందుకు, రద్దీని అదుపు చేసేందుకు ప్రతీ ఆది, సోమవారం స్వామివారికి అభిషేకాలు, అన్నపూజలు రద్దు చేస్తున్నట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 23 నుంచి 27 వరకు జరిగే ఉత్సవాల సందర్భంగాను అభిషేకాలు, అన్నపూజలు రద్దు చేస్తున్నామని పేర్కొన్నారు. భక్తులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న ప్రధానోపాధ్యాయుడి పోస్టుతో పాటు ఫిజికల్ డైరెక్టర్ పోస్టులను భర్తీ చేయాలని పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఒగ్గు బాల్‌రాజ్‌యాదవ్ కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని విద్యాశాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వాకాటి కరుణకు వినతి పత్రం అందజేశారు.

అభివృద్ధి చేసేవారికే పట్టం

- నూతన ఓటర్లు



కోనరావుపేట(వేములవాడ): నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ.. అభివృద్ధి చేసే నాయకుడికు పట్టం కడతాం. కల్లిబొల్లి మాటలు చెప్పి.. ఎన్నికలు ముగియగానే ముఖం చాటేసే నాయకులు మాకొద్దు. మారుమూల ప్రాంతమైన మా కోనరావుపేట మండలంలోని పలు గ్రామాలకు కనీస సౌకర్యాలు లేవు. సౌకర్యాలు కల్పిస్తామని భరోసా ఇచ్చే నాయకులకు మా ఓటు వేస్తామంటున్నారు కొత్తగా ఓటుహక్కు పొందిన యువత. ఈ సందర్భంగా వారి మనోభావాలు..

ప్రజల్లో ఉండే నాయకుడికే..



మాది కోనరావుపేట మండల కేంద్రం. నేను బీటెక్ ఫైనలియర్ చదువుతున్నాను. నాకు ఈసారే ఓటువేసే అవకాశం వచ్చింది. ప్రజలకు అందుబాటులో ఉంటూ నిత్యం ప్రజాసమస్యలను తెలుసుకుంటూ పరిష్కరించే నాయకుడినే ఎన్నుకుంటాం. – జొన్నల నిఖిత, బీటెక్ ఫైనలియర్,కోనరావుపేట

ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి



ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి. విలువైన ఈ ఓటు హక్కును నోటుకు అమ్ముకోకుండా సరైన అభ్యర్థిని ఎంచుకోవాలి. ఒక్కసారి ఓటును అమ్ముకుంటే ఐదేళ్లపాటు ఇబ్బంది పడతాం. యువకులు బాగా ఆలోచించి ఓటుహక్కును వినియోగించుకోవాలి.
– మోకాళ్ల సునీల్‌రెడ్డి, బీటెక్

ప్రజలకు అందుబాటులో ఉండాలి



డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న నాకు తొలిసారి ఓటు హక్కు వచ్చింది. ఎమ్మెల్యేగా గెలుపొందిన అభ్యర్థి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండాలి. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలు పరిష్కరించే వారికే ఓటు వేస్తాం.
– జిల్లెల్ల అజయ్‌రెడ్డి, డిగ్రీ ఫైనలియర్

ప్రలోభాలకు లోనుకావద్దు



ప్రజల కోసం పనిచేసే పాలకులను ఎన్నుకోవాలి. ఓటుహక్కు చాలా విలువైనది, ప్రలోభాలకు లోనుకావద్దు. వివిధ పార్టీల అభ్యర్థులు పెట్టే ప్రలోభాలకు లోను కాకుండా నచ్చిన అభ్యర్థికే ఓటు వేయాలి. సరైన నాయకుడిని ఎన్నుకుంటేనే మన ప్రాంతం అభివృద్ధి చెందుతుంది.
– మెతుకు వన్షిక

సమస్యలు పరిష్కరించాలి



నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలు పరిష్కరించే వారికే ఓటు వేస్తాం. చాలా గ్రామాలలో మౌలిక సౌకర్యాలు లేవు. నా తొలి ఓటు మంచి చేసే నాయకుడికే వేస్తా.
– దుగ్గు మధు, నిజామాబాద్